
జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం | 17 | అక్టోబర్ | 2025 ◆ పేజీలు : 8



# గిరిజన గురుకుల విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** జిల్లాలో గిరిజన విద్యార్థుల సమగ్ర అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపు, మౌలిక వసతుల కల్పించడమే ప్రధాన లక్ష్యమని జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు, గురువారం పాల్వంచ మండల పరిధిలోని కిన్నెరసాని గిరిజన గురుకుల పాఠశాల (బాలుర) ను సందర్శించిన ఆయన, పాఠశాల విద్యా కార్యక్రమాలు, వసతుల పరిస్థితి, విద్యార్థుల సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాల ప్రిన్సిపాల్ శ్యామ్ కుమార్ నుండి విద్యార్థుల హాజరు, వసతి గృహాలు, భోజనశాల, క్రీడా వసతులు

మిగతా 2 లో...

- మృతుడు నాగరాజు కేసులో పురోగతి శూన్యం
- మరణ వాంగ్మూలం ఉన్నా ముందుకుసాగని విచారణ
- వడ్డీ దారుల ఆగడాలకు బలైన ఓ ప్రాణం
- గత 13న కొత్తగూడెంలో జరిగిన విషాద ఘటన
- ఇప్పటి వరకు కనీసం నింది తులు ఎవరో తేల్చని పోలీసులు
- సానుభూతి పేరుతో మధ్య వర్తుల మాయాజాలం
- సెటిల్ మెంట్ పేరుతో కేసును కప్పిపుచ్చే ప్రయత్నాలు
- నిందితుల నుండి రూ.25 లక్ష లకు బేరం?
- బాధితులకు మాత్రం రూ. 2–5 లక్షల మోసపూరిత హామీలు
- విచారణను ముడిపెడుతోన్న రాజకీయ లాబీలు
- న్యాయాన్ని నెమ్మదిగా మింగేస్తున్న ఒత్తిడులు, ఒప్పందాలు

3 లో..

## మరణ వాంగ్మూలాన్నే...

# మర్డర్ చేస్తున్నారు..?

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య యత్నం చేసుకుని మృతి చెందిన పాత కొత్తగూడెం నివాసి మెరుగు నాగరాజు మరణం వెనక అసలు నిజాలు బయటకు వస్తున్న కొద్దీ, దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు కూడా అంతకంతకు పెరుగుతున్నాయి. గత నెల 28న మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి సుమారు 15 రోజులు ప్రాణాలతో పోరాడి ఈ నెల 13న అతను మృతి చెందాడు. అయితే నాగరాజు చనిపోకముందే ఎందుకు ఆత్మహత్యా యత్నం చేసుకోవాల్సి వచ్చిందో, ఎవరు అతనిని ఇబ్బందులకు గురి చేశారో.. ఓ వీడియో రూపంలో ధృవీకరించాడు. కానీ ఆ వీడియోను బయటికి రానీయకుండా మొదటి రోజు నుంచే కొందరు శక్తులు అడ్డుపడినట్టు సమాచారం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

# మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి,అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పేర్కొన్నారు.గురువారం మండలంలోని సుక్కల బోడు రైతు వేదికలో జరిగిన పోషణ్ అభియాన్ లో భాగంగా పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొని మాట్లాడాతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని అందించాలని ఆయన సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో మహిళలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. మండలంలో సొంత భవనాలు లేని అంగన్వాడి కేంద్రాలకు నిధులు మంజూరు చేస్తానన్నారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషక విలువలు కలిగిన ఆహార పదార్థాల ప్రదర్శనను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ కే. మంగతారా, ఎంపీడీవో మల్లేశ్వరి,పిహెచ్సి సిహెచ్ఓ పార్వతీ, రమేష్, అంగన్వాడి సూపర్వైజర్లు అనురాధ, యశోదమ్మ, లక్ష్మి, నిర్మల, విజయకుమారి, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు కోరం సురేందర్, కోయగూడెం మాజీ సర్పంచ్ ఉమా, మండల నాయకులు, అంగన్వాడి టీచర్లు, ఆయాలు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు పరీక్షలకు సిద్ధమయ్యేలా వార్డెనులు బాధ్యత తీసుకోవాలి

- భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్



**భద్రాచలం, అక్టోబరు 18, ప్రజాజ్యోతి :** గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు మంచి విద్యాబోదనతో పాటు వారికి అన్ని రకాల మౌళిక వసతులు కల్పించి ఇప్పటి నుంచే పదో తరగతి పరీక్షలకు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేలా సంబంధిత హెచ్ఎం, వార్డెన్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని భద్రాచలం ఐటీడీఏ పీవో బి.రాహుల్ అన్నారు. గురువారం ఐటీడీఏ కార్యాలయంలో పాఠశాలల్లో మౌళిక వసతుల గురించి ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా పాఠశాలలకు మరమ్మత్తులు అవసరమైతే వెంటనే చేయించాలని అన్నారు. ప్రతి పాఠశాలలో డైలీవేజ్ వర్కర్లు సమ్మెలో ఉన్నందున ఈ నెల 20వ తేదీ వేచి చూసి ప్రతి పాఠశాలలో రెగ్యులరు వర్కర్లను నియమించుకునే వెసులుబాటు కల్పిస్తామని అన్నారు. అన్ని పాఠశాలల్లో మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు ప్రతి పాఠశాలకు మెడికల్ కిట్లు సరఫరా చేసినందున వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీడీ వెల్ఫేర్ అశోక్, ఈఈ మధుకర్, జీసీసీ డీఎం సమ్మయ్య, ఏసీఎంవో రమేష్, ఏటీడీవోలు చంద్రమోహన్, భారతీదేవి పాల్గొన్నారు.

## గిరిజన గురుకుల విద్యార్థుల సమగ్ర అభివృద్ధే లక్ష్యం





(మొదటి పేజీ తరువాయి...)

అవసరమైన మౌలిక సదుపాయాలపై పాఠశాల సిబ్బంది నుండి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాల ఆవరణలో ఖాళీగా ఉన్న భూమిని సద్వినియోగం చేసుకుని కిచెన్ గార్డెన్ ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థులు స్వయంగా మొక్కలు నాటి, వాటిని పరిరక్షించడం ద్వారా పర్యావరణ స్ఫూర్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కిచెన్ గార్డెన్ ద్వారా పాఠశాల భోజనశాలకు తాజా కూరగాయలు లభిస్తాయని సూచించారు. పాఠశాల పరిసర భద్రత దృష్ట్యా కాంపౌండ్ వాల్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ హామీ ఇచ్చారు. అదేవిధంగా పాఠశాల మైదానాన్ని ఆటల కోసం అభివృద్ధి చేయాలని, విద్యార్థుల క్రీడా ప్రతిభను వెలికితీసే దిశగా తగిన సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అదేవిధంగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ డి ఎస్ ఏ తరపున విద్యార్థులకు టేబుల్ టెన్నిస్ టేబుల్, ఆట సామాగ్రి, క్రీడా పరికరాలను అందజేశారు. అనంతరం కలెక్టర్ విద్యార్థులతో టేబుల్ టెన్నిస్ ఆడి ఉత్సాహపరిచారు. ప్రభుత్వం అందిస్తున్న గురుకుల విద్యా విధానం గ్రామీణ, గిరిజన ప్రాంతాల విద్యార్థుల భవిష్యత్తును మారుస్తోందని, జిల్లా యంత్రాంగం విద్యార్థుల అభివృద్ధికి అవసరమైన ప్రతి సదుపాయం కల్పించేందుకు కట్టుబడి ఉందని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం–భద్రాద్రి రీజినల్ కోఆర్డినేటర్ అరుణ కుమారి, జిల్లా క్రీడా శాఖ అధికారి పరంధామ రెడ్డి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు , సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ బంద్ కు ఇన్సాఫ్ కమిటీ సంపూర్ణ మద్దతు




**ఇల్లందు, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం ఈనెల 18న జరగనున్న బీసీ రిజర్వేషన్ కోసం ఈనెల 18న జరగనున్న బీసీ బంద్ కు ఇన్సాఫ్ కమిటీ సంపూర్ణ మద్దతు తెలుపుతుందని ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి యండి. నజీర్ అహ్మద్ తెలిపారు. గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బ్రాహ్మణ, బనియా పార్టీగా పేరొందిన దురహంకార అగ్ర–కుల పక్షపాతి బీజేపీ ఓబీసీ రేజర్వేషన్లను రద్దు చేసే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. ఓబీసీ గుర్తింపును తిరస్కరించడం, కుల ఆధారిత రిజర్వేషన్లను వ్యతిరేకించడంలో సంఘ్ పరివార్ ఆదేశాలను బీజేపీ తూచా తప్పకుండ పాటిస్తుందని, అందుకే తెలంగాణాలో బీసీ రిజర్వేషన్ పై బీజేపీ ద్వంద వైఖరి ప్రదర్శిస్తుందని విమర్శించారు. బీసీలకు 42 శాతం రేజర్వేషన్ పై ఆర్డినెన్సు ను గవర్నర్ ఆమోదించకపోవడం బీజేపీ కుట్రలో భాగమేనని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు జీఓతోపాటు, స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై హైకోర్టు స్టే విధించడం విచారకరమన్నారు. బీజేపీ ప్రభుత్వం వెంటనే పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి, రాజ్యాంగ సవరణ చేసి 9వ షెడ్యూల్ లో చేర్చి బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు సహకరించాలని డిమాండ్ చేశారు.

# బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మోకాలడ్డుతున్న మోడీ.

- చట్టసభలు, తెలంగాణ ప్రజలు ఆమోదిస్తే కేంద్రానికి అభ్యంతర మేంటి
- 42శాతం రిజర్వేషన్లపై రాజకీయం చేయొద్దు
- 18న జరిగే 'బంద్'కు సంపూర్ణంగా బలపరుస్తున్నాం




**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 16, ప్రజా జ్యోతి** తెలంగాణ రాష్ట్రంలో బిసిలకు 42శాతం రిజర్వేషన్ల అమలును కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మోకాలడ్డుతోందని, రిజర్వేషన్ల అంశంపై కేంద్రం రాజకీయాలు చేయడం సరైంది కాదని, ఇలాంటి చర్యలు బిసిల పట్ల కేంద్రానికున్న వ్యతిరేక వైఖరి బహిర్గతమవుతోందని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు అన్నారు. స్థానిక చంద్ర రాజేశ్వరరావు భవన్ లో గురువారం ప్రజా సంఘాల నాయకులతో 18న జరిగే బంద్ సందర్భంగా నిర్వహించిన సన్నహాక సమావేశంలో పూర్ణచంద్రరావు మాట్లాడుతూ తెలంగాణ ఉభయ సభలో 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లును ఆమోదించి గవర్నరుకు ఆమోదానికి పంపారని, ఈ బిల్లును ఆమోదించి ఆర్డినెన్సు ఇవ్వకుండా మోడీ ప్రభుత్వం తొక్కి పట్టిందని ఆరోపించారు. చట్టసభలు, అన్నివర్గాల ప్రజలు కూడా విస్తృతంగా మద్దతు తెలిపారని, ఇంత స్పష్టమైన ప్రజాభిప్రాయాన్ని కేంద్రం పట్టించుకోకపోవడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని ఆయన విమర్శించారు. బీసీ వర్గాలకు న్యాయం చేయడంలో మోడీ ప్రభుత్వం వెనుకడుగు వేస్తోందని, బీసీల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తోందని అన్నారు. బీసీల అభ్యున్నతి దేశ ప్రగతికి కీలకమని అన్నారు, కావున రిజర్వేషన్ల బిల్లునుచట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. బీసీల హక్కులను కాపాడే బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందని, బీసీల హక్కుల కోసం సిపిఐ మరింత బలమైన ఉద్యమాన్ని కొనసాగిస్తుందని అన్నారు, రాష్ట్ర ప్రజలను రాజకీయంగా విభజించే కుట్రలను తిప్పికొడతామని హెచ్చరించారు. బిసి జేఏసీ తలపెట్టిన అక్టోబర్ 18 రాష్ట్రవ్యాప్త బంద్‌ను సిపిఐ సంపూర్ణంగా బలపరుస్తుందని ఈ సందర్భంగా ప్రకటించారు, బందులో అన్ని ప్రజాసంఘాలు, కార్మిక, రైతు, విద్యార్థి సంఘాలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అడుసుమిల్లి సాయిబాబా, జిల్లా సమితి సభ్యులు గుండాల నాగరాజు, వీ పద్మజ, డి సుధాకర్, వీసంశెట్టి విశ్వేశ్వరరావు, వరక అజిత్, అన్నారపు వెంకటేశ్వర్లు నిమ్మల రాంబాబు, ఇట్టి వెంకట్రావు, శనగారపు శ్రీనివాసరావు, నరహరి నాగేశ్వరరావు, వల్లపు యాకయ్య, జకరయ్య, సంజీవరావు, చెన్నయ్య, కొంగర అప్పారావు, బీవీ సత్యనారాయణ, ఇరుకు రామారావు, ఆదినారాయణ, కరీం, పత్తి వేంకటేశ్వర్లు, కోమటి శ్రీనివాసరావు, మురళి నాయక్, sk గౌస్, టైలర్ బాబు, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు నాయకులు పాల్గొన్నారు.

## బీసీ బంద్ కు అన్ని వర్గాలు సహకరించాలి



**ఇల్లందు, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** ఈనెల 18న జరగనున్న బీసీ బంద్ కు ఇల్లందులోని అన్ని వర్గాలు సహకరించి జయప్రదం చేయాలని బిఆర్ఎస్ వ్యవస్థాపక నాయకులు, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్ కోరారు. గురువారం దిండిగాల రాజేందర్ కార్యాలయంలో జరిగిన బిఆర్ఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీ లకు జరుగుతున్న అన్యాయాన్ని ప్రశ్నిస్తూ, బీసీ లకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ హామీని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీసీ సంఘాల నిర్ణయం మేరకు 18న రాష్ట్ర బంద్ కు పిలుపు ఇవ్వడం జరిగిందన్నారు. ఈ బంద్ ను విజయవంతం చేయాలని బిఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కెటిఆర్ పిలుపు ఇవ్వడం జరిగిందని పేర్కొన్నారు. బీసీ సంఘాల మద్దతుగా ప్రత్యక్షంగా ఇల్లందు బంద్ కు బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొంటారని, బీసి సంఘాలకు అండగా నిలబడి భవిష్యత్ కార్యక్రమాలన్నింటికి అండగా ఉండి, బీసీ రిజర్వేషన్ సాధించేవరకు పోరాడుతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ద్వంద వైఖరిని ప్రజలకు వివరిస్తామని, కామారెడ్డి కాంగ్రెస్ పార్టీ బీసీ డిక్లరేషన్ అమలు చేయకుంటే మరింతగా ఉద్యమిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో నాయకులు ఎస్. రంగనాధ్, అబ్దుల్ నభి, జబ్బార్, యలమందల వాసు, ఎర్రబెల్లి కృష్ణయ్య, సనా రజేష్, లలిత్ కుమార్ పాసి, ఉపేందర్, వసంతరావు, పరికపెల్లి రవి, రామ్ లాల్ పాసి, బజారు సత్యనారాయణ, దేరంగుల పోషం, పాలడుగు రాజశేఖర్, సర్దార్, ఇమ్రాన్, కిషన్ పాసి, మదార్ బీ, సత్యవతి తదితరులు పాల్గొన్నారు.

## కపాస్ కిసాన్ యాప్ పై రైతులకు అవగాహన



**ఇల్లందు, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** పట్టణంలో వ్యవసాయ మార్కెట్ యార్డులో గురువారం కపాస్ కిసాన్ యాప్ పై రైతులకు గ్రేడ్ 3 కార్యదర్శి ఈ. నరేష్ కుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి రైతులు తమ పత్తి పంటను సిసిఐ లో అమ్మేందుకు కిసాన్ కపాస్ యాప్ ఎలా వినియోగించాలో వివరించడం జరిగిందన్నారు. ఈ యాప్ ద్వారా తమ పత్తి పంటను సిసిఐలో అమ్మేందుకు స్లాట్ బుకింగ్ ఎలా చేసుకోవాలనే దానిపై ఇల్లందు మార్కెట్ కమిటీ నందు ప్రత్యేక సెల్ ఏర్పాటు చేసి పత్తి రైతులకు అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. ప్రతి రోజు రైతులకు అవగాహనా కల్పించడం జరుగుతుందన్నారు. వివిధ గ్రామాల రైతులు ఈ అవగాహన సదస్సులో పాల్గొని వారి అనుమానాలు నివృత్తి చేసుకొని, యాప్ వినియోగాన్ని తెలుసుకోవడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ ఎన్. శ్రీనివాసరావు, సిబ్బంది లక్ష్మయ్య, రంజిత్, మధు, రవి, సందీప్, మునీర్, లక్ష్మీ, విజయ తదితరులు పాల్గొన్నారు.

## పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ లో వార్షిక తనిఖీ.

- (డి.ఎస్ .పి) ఆర్. సతీష్ కుమార్ సూచనలు – సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలి.




**పాల్వంచ(రూరల్) అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ లో గురువారం ఉప పోలీసు అధికారి (డి.ఎస్ .పి) ఆర్. సతీష్‌కుమార్ వార్షిక తనిఖీ నిర్వహించారు. తనిఖీలలో భాగంగా ఆయన స్టేషన్ రికార్డులను పరిశీలించి, పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సిబ్బంది విధుల పట్ల అంకితభావంతో పని చేయాలని, ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి మర్యాద పూర్వకంగా స్పందించాలని ఆదేశించారు. కేసులు వేగంగా పరిష్కరించేలా కృషి చేయాలని, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ సభ్యుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అదేవిధంగా సిబ్బంది ఆరోగ్యం, కుటుంబ పరిస్థితులు తెలుసుకొని వారికి అవసరమైన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ రూరల్ ఎస్ .ఐ బి. సురేష్, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



- మృతుడు నాగరాజు కేసులో పురోగతి శూన్యం
- మరణ వాంగ్మూలం ఉన్నా ముందుకుసాగని విచారణ
- వడ్డీ దారుల ఆగడాలకు బలైన ఓ ప్రాణం
- గత 13న కొత్తగూడెంలో జరిగిన విషాద ఘటన
- ఇప్పటి వరకు కనీసం నింది తులు ఎవరో తేల్చని పోలీసులు
- సానుభూతి పేరుతో మధ్య వర్తుల మాయాజాలం
- సెటిల్ మెంట్ పేరుతో కేసును కప్పిపుచ్చే ప్రయత్నాలు
- నిందితుల నుండి రూ.25 లక్ష లకు బేరం?
- బాధితులకు మాత్రం రూ. 2–5 లక్షల మోసపూరిత హామీలు
- విచారణను ముడిపెడుతోన్న రాజకీయ లాబీలు
- న్యాయాన్ని నెమ్మదిగా మింగే స్తున్న ఒత్తిడులు, ఒప్పందాలు

# మరణ వాంగ్మూలాన్నే... మర్డర్ చేస్తున్నారు..?

వడ్డీ వ్యాపారుల వేధింపులు తాళలేక ఆత్మహత్య యత్నం చేసుకుని మృతి చెందిన పాత కొత్తగూడెం నివాసి మెరుగు నాగరాజు మరణం వెనక అసలు నిజాలు బయటకు వస్తున్నకొద్దీ, దాన్ని కప్పిపుచ్చే ప్రయత్నాలు కూడా అంతకంతకు పెరుగుతున్నాయి. గత నెల 28న మనస్తాపానికి గురై పురుగుల మందు తాగి సుమారు 15 రోజులు ప్రాణాలతో పోరాడి ఈ నెల 13న అతను మృతి చెందాడు. అయితే నాగరాజు చనిపోకముందే ఎందుకు ఆత్మహత్యా యత్నం చేసుకోవాల్సి వచ్చిందో, ఎవరు అతనిని ఇబ్బందులకు గురి చేశారో.. ఓ వీడియో రూపంలో ధృవీకరించాడు. కానీ ఆ వీడియోను బయటికి రానీయకుండా మొదటి రోజు నుంచే కొందరు శక్తులు అడ్డుపడినట్టు సమాచారం.

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి


దాంతో పోలీసులు కేవలం బంధువుల ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేశారు. ఇప్పుడు ఆ వీడియో వెలుగులోకి వచ్చినా కూడా చట్టరక్షకులు మాత్రం పాత పిర్యాదు చుట్టూ తిరుగుతూ కాలం వెల్లదిస్తున్నారు. దీనికి తోడు పట్టణంలో ఉన్న కొందరు చోట, మోటు నేతలు ఆరోపిత నిందితులను కాపాడాలని లక్షల్లో బేరసారాలు చేస్తూ రోజు వారి పబ్బం గడుపుతున్నారు. అటు బాధిత కుటుంబాన్ని నిర్బంధం చేస్తూ--- ఇటు అధికారులతో అనుబంధాన్ని బలపరుచుకుంటూ.. మరణ వాంగ్మూలాన్నే మర్డర్ చేసే ప్రణాళికకు కుతంత్రం చేస్తున్నారు. దాంతో నాగరాజు చనిపోయి నేటికి నాలుగు రోజులు గడుస్తున్నా, మరణ వాంగ్మూలం వీడియో ఆధారంగా ఉన్నా కేసులో మాత్రం ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.

## 27న అసలు ఏం జరిగింది..?

వడ్డీ బకాసురుల వేధింపులు తాళలేక చనిపోయిన నాగరాజు ఎందుకు సెప్టెంబర్ 28 ఉదయాన్నే పురుగుల మందు సేవించాడు అన్నదే ఇప్పుడు మిలియన్ డాలర్ల ప్రశ్న. వారి ఆగడాలను గత కొన్ని నెలలుగా భరిస్తున్న అతను.. ఆ రోజే ఎందుకు ఆ నిర్ణయానికి వచ్చాడు? అతనిని ముందు రోజు, అంటే సెప్టెంబర్ 27న ఇంటికి పిలిపించిన కొందరు వడ్డీదారులు అక్కడ ఎలాంటి చర్యలకు దిగారన్నది ఇప్పుడు కీలక ప్రశ్న. అప్పటివరకు ఎంతటి కష్టం వచ్చినా దృఢంగా నిలబడి ఉన్న నాగరాజు ఆ రోజు తర్వాత ఎందుకు కుంగిపోయి ప్రాణాలు తీసుకునే నిర్ణయానికి వచ్చాడు? మహారాణులాంటి ఇద్దరు కూతుళ్లే తన ప్రపంచం అనుకోని జీవనం కొనసాగితున్న నాగరాజుకి ఆ సమయంలో వాళ్ళ భవిషత్తు పట్ల కనికరం కలగనంత ఆవేదనకు ఎందుకు గురయ్యాడు. భవిషత్తు పట్ల ఎన్నో కళలతో సాగుతున్న జీవితాన్ని ఒక్కసారిగా ఇలా ఎలా ముగించుకోవలనుకున్నాడు. ఆ సమయానికి తన కుటుంబ భాద్యత పట్ల కనికరం కలగనంతగా ఆవేదనకు గురయ్యాడంటే, ఆ రోజు ఏం జరిగిందో అన్నది అందరి మనసులను తొలిచేస్తోంది. అయితే సంబంధీకుల వాదన ప్రకారం.. ఆ రోజు నాగరాజును మానసికంగా, శారీరకంగా బాగా ఇబ్బందికి గురి చేశారన్నది స్పష్టమవుతోంది. దాంతోనే అతను అవమానకరంగా, భేదరిపోయి ప్రాణాలు తీసుకునేందుకు నిశ్చయించుకున్నాడని తెలుస్తోంది.

## మాఫియాను తలపిస్తున్న మధ్య వర్తులు..

నాగరాజు మరణం తర్వాత సానుభూతి పేరుతో రంగంలోకి దూసుకొచ్చిన కొందరు మధ్యవర్తులు ఇప్పుడు కథనే మలుపు తిప్పే ప్రయత్నంలో ఉన్నారు. మొదట రోజుల్లో ఆర్థిక సహాయం, న్యాయ సాయం పేరుతో చేరిన వీళ్ల అసలు ముఖం ఇప్పుడు బయటపడుతోంది. ఈ వ్యవహారంలో నిందితులుగా ఆరోపించబడిన వడ్డీ దారులను కాపాడేందుకు వీళ్లు



విశ్వప్రయత్నాలు చేస్తున్నట్టు తెలుస్తోంది. సమాచారం ప్రకారం, ఆ వడ్డీ వ్యాపారులతో రూ.25 లక్షల ఒప్పందం కుదుర్చుకుని, బాధిత కుటుంబానికి చిన్న మొత్తంలో "సెటిల్" చేయాలని వీరు పూనుకున్నారని విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. పోలీసు విచారణకు వెళ్లే దశలో ప్రతి సారి "మేమే చూసుకుంటాం" అంటూ అడ్డుపడుతూ, కుటుంబ సభ్యుల చుట్టూ నిర్బంద వలయం ఏర్పరచారని సమాచారం. నాగరాజు చివరి వీడియోలో ఉన్న పేర్లను గోప్యంగా ఉంచాలని కూడా వీరు ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఈ "సెటిల్ మెంట్ బ్యాచ్"లో ప్రధానంగా నలుగురు వ్యక్తులు కీలకంగా వ్యవహరిస్తున్నట్టు సమాచారం. వీరిలో ఒకరు పట్టణంలోని జాతీయ పార్టీకి చెందిన టౌన్ స్థాయి నాయకుడు కాగా.., మరోవాడు మాజీ కౌన్సిలర్, ప్రస్తుతం రియల్ ఎస్టేట్ దందాలో చురుకుగా ఉన్న టిడిపి నేత గా తెలుస్తోంది. మిగతా ఇద్దరిలో ఒకరు బూడిదగడ్డకు చెందిన ఆంబులెన్స్ నిర్వాహకుడు, మరొకరు సింగరేణి సెంట్రల్ వర్క్ షాప్ లో ఉద్యోగిగా ఉన్న మాజీ కౌన్సిలర్. ఈ నలుగురు ఇప్పుడు కేసు దిశను పూర్తిగా మార్చే ప్రయత్నం చేస్తూ బాధిత కుటుంబాన్ని నిస్సహాయంగా మార్చేస్తున్నారని స్థానిక వర్గాలు చెబుతున్నాయి. నాగరాజు చివరి వీడియోలో ఉన్న వివరాలు బయటకు రాకుండా చేయడానికే వీళ్లు నానావిధాల ఒత్తిడి తెస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వీళ్ల వెనుక రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అనుచరులుగా చలామణి అవుతున్న కొందరు పట్టణ వాసులు కూడా ఉన్నారనే సమాచారంతో ఈ వ్యవహారం కొత్తగూడెంలో మరింత సంచలనంగా మారింది. దాంతో 'సెటిల్ మెంట్' పేరుతో మధ్యవర్తిత్వం చేస్తున్న ఈ బృందం వ్యవహారం ఇప్పుడు ఒక మాఫియా నెట్ వర్క్ ను తలపిస్తోంది. సానుభూతి, సేవ, సాయం అన్న ముసుగుల వెనుక వీళ్ల ముఖాలు ఇప్పుడు ప్రజల ఎదుట క్రమంగా బయటపడుతున్నాయి. బాధితుడి మరణాన్నే లాభదాయక అవకాశంగా మలుచుకునే రీతిలోమధ్య వర్తిత్వం చేస్తున్న వీళ్ళ వ్యవహారం ఇప్పుడు మాఫియాను తలపిస్తోంది. ఇప్పుడు నాగరాజు మరణం ఒక్క వ్యక్తి విషాదం కాదు వ్యవస్థ మౌనానికి ప్రతిబింబం. వడ్డీ మాఫియాలు, మధ్యవర్తుల కుతంత్రాలు, అధికారుల నిర్వేదం కలిసిన ఈ నిశ్శబ్దం ఇప్పుడు సమాజాన్ని ప్రశ్నిస్తోంది. మరణ వాంగ్మూలం మాట్లాడింది--- కానీ న్యాయం మాత్రం ఇంకా మౌనంగానే ఉంది అని.

## వీడియో పోలీసుల చేతిలోనే..

నాగరాజు మరణం వెనక దాగి ఉన్న సత్యాన్ని చాటే వీడియో ప్రస్తుతం పోలీసుల చేతుల్లోకి చేరినట్టు విశ్వసనీయ వర్గాలు చెబుతున్నాయి. అయినా ఇప్పటికీ అధికారులు ఏ విధమైన తదుపరి చర్యలు తీసుకోకపోవడం, స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది. ఆ వీడియోలో నాగరాజు స్వయంగా పేర్లు చెబుతూ తనను వేధింపులకు గురిచేశారని స్పష్టంగా రికార్డ్ చేసి ఉన్నప్పటికీ, ఆ ఆధారాన్ని బేస్ చేసుకుని స్వప్రేరితంగా కేసు నమోదు చేయకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఇప్పటి వరకు మృతుడి సోదరుడి ఫిర్యదుతోనే సర్దిపెట్టుకున్నారు. వీడియో లభించిన తర్వాత, దాన్ని సాక్ష్యాధారంగా పరిశీలించడం, సంబంధిత వ్యక్తులను విచారణకు పిలవడం, అవసరమైతే పునర్విచారణ ఆదేశించడం.. ఇవన్నీ సాధారణ న్యాయ ప్రక్రియలో భాగమే. కానీ ఇప్పటివరకు అలాంటి ఏ చర్యా చేపట్టకపోవడం ప్రజల్లో మరింత అనుమానాలను పెంచుతోంది. దీంతో పోలీసు వ్యవస్థలో ఎక్కడో ఏదో మౌన ఒత్తిడి ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. స్థానికంగా వినిపిస్తున్న చర్చల ప్రకారం.. కొందరు మధ్యవర్తులు, పట్టణంలోని ప్రభావశీల రాజకీయ నాయకుల ఒత్తిడి కారణంగానే పోలీసులు ఈ కేసులో వెనుకంజ వేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పై స్థాయి నుండి కూడా కొంత రాజకీయ ప్రేరేపణ జరుగుతోందనే చర్చ ఊపందుకుంది. ఫలితంగా అధికారులు విచారణను ముందుకు తీసుకెళ్లకుండా నిర్లక్ష్య ధోరణిలో వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ పరిస్థితుల్లో ఇలాంటి మరణ వాంగ్మూలం ఆధారంగా కేసు తిరిగి నమోదు చేయడం పోలీసులకు చట్టపరంగా సాధ్యమే. కానీ ఇక్కడ మాత్రం 'పరిశీలనలో ఉంది' అన్న సమాధానంతో కాలం గడిపేస్తుండటం, ఈ కేసు వెనక ఉన్న రాజకీయ, సామాజిక ఒత్తిళ్లను స్పష్టంగా బయటపెడుతోంది. కనీసం ఇప్పటి వరకు ఒక్క నిందితుని కూడా వన్ టౌన్ పోలీసులు కస్టడీలోకి తీసుకోకపోవడంతో కేసు పురోగతిపై ప్రజల్లో తీవ్ర అనుమానాలను కలుగుతోంది.

## బీసీల రిజర్వేషన్ కు అన్ని పార్టీలు, వర్గాలు సహకరించాలి




**ఇల్లందు, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** బీసీ రిజర్వేషన్ న్యాయబద్ధమైందని, బీసీల రిజర్వేషన్ కు అన్ని పార్టీలు, వర్గాలు సహకరించాలని టిడిపి ఇల్లందు నియోజకవర్గ ఇంచార్జ్ ముద్రగడ వంశీ కోరారు. గురువారం స్థానిక టిడిపి కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు బీసీలకు రాజ్యాధికారం అందించిన పార్టీ తెలుగుదేశం అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీసీల రిజర్వేషన్ అంశం ప్రధాన చర్చ జరుగుతుందని, స్వతంత్రం తర్వాత బీసీలకు రాజ్యాధికారం అందించింది అన్న ఎన్టి రామారావు తెలుగుదేశం పార్టీ అని, తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాతనే చాలామంది బీసీలకు మంచి అవకాశాలు కల్పించి రాష్ట్రస్థాయి నేతలుగా ముందుకు తీసుకురావడం జరిగిందన్నారు. ఆనాడు ఎన్టీఆర్ బీసీలను ముందుకు తీసుకురాబట్టే మంత్రులు, జిల్లా పరిషత్ చైర్మన్లు, ఎంపీలు, ఎమ్మెల్సీలుగా ముందుకు వచ్చారని, ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతం నుండి ప్రాతినిధ్యం వహించిన దేవేందర్ గౌడ్ పార్టీలోనే రెండో స్థానంలో ఉంటూ జిల్లా పరిషత్ చైర్మన్ గా, హోం మంత్రిగా, రెవెన్యూ మంత్రిగా, రాజ్యసభ సభ్యులుగా అనేక పదవులు ఇచ్చి గుర్తించిందని పేర్కొన్నారు. రాష్ట్రం విడిపోయినప్పటి నుండి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్టాలలో బీసీలనే రాష్ట్ర అధ్యక్షులుగా కొనసాగిస్తున్నారని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కోసం ఈ నెల 18న తెలంగాణలో జరగబోయే బంద్ కు తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు చాందావత్ రమేష్ బాబు, ఇల్లందు పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు పాలమాలు బాలకృష్ణ, దేశవత్ శ్రీహరి, నాయకులు కోటేశ్వరరావు, శ్రీహరి, కారు నర్సన్న, కంది రవి, మాటేలా రత్నాకర్, గోగేలా రాజేష్, శ్యామ్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## 18న నిర్వహించే బీసీ బంద్‌ను జయప్రదం చేయాలి




**టేకులపల్లి,అక్టోబర్16,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండల కేంద్రంలో బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో గురువారం సమావేశం నిర్వహించి,బంద్ పిలుపుకు మద్దతు తెలపాలని నాయకులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ బి సిలకు అన్యాయాన్ని నిరసిస్తూ బీసీలంతా రాజకీయ పార్టీలకతీతంగా ఏకమై పోరాడితేనే కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు దిగివస్తాయని చెప్పారు. బీసీ రిజర్వేషన్ల ఉద్యమాన్ని భవిష్యత్తులో చట్టసభల్లో బీసీలకు రిజర్వేషన్లు సాధించేదాకా కొనసాగించాలని పిలుపునిచ్చారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కోసం బందులో వ్యాపార సంస్థలు, ప్రైవేటు సంస్థలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు అన్ని స్వచ్ఛందంగా మూయాలని వారు పిలుపునిచ్చారు.ఈ నెల 18న జరిగే బంద్‌లో బీసీలు పార్టీలకతీతంగా పాల్గొని, విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల బీసీ కుల సంఘాల నేతలు నర్సింగ్ లక్ష్మయ్య, మావునూరి రమేష్, తౌడోజు బిక్షమయ్య, గాడేపల్లిరాములు, చిర్రా వెంకటయ్య, ధర్మపురి వీరబ్రహ్మచారి, బైరోజు బిక్షమయ్య, సింగం చిన్న రాజేశ్వరరావు,కందగట్ల సదానందం, ఆమెడ వెంకన్న, ఆరేళ్ల కుమార్, అవధూర్తి దామోదర్,ఎనగందుల రామకృష్ణ పాల్గొన్నారు.

# గొల్లగూడెం లోని ఆయిల్ మిల్లును తెరిపించాలి

- **మిల్లులో పనిచేసే 150 కుటుంబాలకు ఉపాధి కల్పించాలి**
- **సిఐటియు ఆధ్వర్యంలో కార్మికుల తో కలిసి కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన**



**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 16, ప్రజా జ్యోతి** పాల్వంచ పట్టణంలోని గొల్లగూడెం లో గల ఆయిల్ మిల్లును ప్రారంభించి, అందులో పనిచేసిన 150 కుటుంబాలకు ఉపాధి కల్పించాలని డిమాండ్ చేస్తూ సిఐటియు ఆధ్వర్యంలో కార్మికులతో కలిసి గురువారం స్థానిక కలెక్టరేట్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు, సిఐటియు పాల్వంచ పట్టణ కన్వీనర్ కె సత్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దొడ్డా రవికుమార్ మాట్లాడుతూ గొల్లగూడెంలో ఉన్న ఆయిల్ మిల్లును వాతావరణ కాలుష్యం పేరుతో మోతబడిన మిల్లును తక్షణమే తెరిపించాలని ఆయన డిమాండ్ చేశారు, 40 సంవత్సరాల క్రితం సంకా నాగయ్య నూనె మిల్లు ఏర్పాటు చేశారని, అప్పటినుండి గొల్లగూడెం గ్రామప్రజలు ఆ మిల్లులో హమాలీలుగా, విత్తన గ్రేడింగ్ కార్మికులుగా షుమారు 150 మందిమి ఉపాధి పొందుతూ జీవనం సాగిస్తూ ఉండేవారని, గత రెండు నెలల క్రితం కొత్తగా అక్కడ ఇల్లు కట్టుకున్న సామా సందీపరెడ్డి అనేవ్యక్తి మిల్లు యాజమాన్యాన్ని మిల్లు మూసేయాలని బెదిరిస్తుండడంతో అందుకు మిల్లు యజమాని అంగీకరించకపోవడంతో పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు పిర్యాదు చేసి విద్యుత్ సరఫరా నిలిపివేసే విధంగా చేశారని అన్నారు, దీంతో మిల్లు యజమాని వచ్చే కొద్దిపాటి డబ్బుతో కంట్రోల్ చేసే బ్లోయర్ ఏర్పాటు చేశారని, అయినప్పటికీ పొల్యూషన్ అధికారులు దానిని పరిశీలించలేదని, దాంతో మిల్ ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోవడంతో 150 మంది కార్మికులు ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని అన్నారు, కావున కార్మికుల పట్ల సమగ్ర విచారణ చేసి సందీప్ రెడ్డి అనే వ్యక్తిపై, చర్యలు తీసుకొని మిల్లును తెరిపించే విధంగా పొల్యూషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు, అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టరేట్ ఏవో కు ,స్థానిక శాసనసభ్యులు కూనం నేని సాంబశివరావుకు, పొల్యూషన్ అధికారికి వినతి పత్రం అందజేశారు, ఈ నిరసన కార్యక్రమంలో మిల్లులో పనిచేస్తున్న హమాలీలు శ్రీను సురేష్ ఎం శ్రీను వెంకన్న అక్కడ పని చేస్తున్న మహిళలు పాల్గొన్నారు.

## గో ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆహార దినోత్సవం వేడుకలు

- **నిరుపేద పిల్లలకు ప్రతిరోజు ఆహారం అందిస్తున్న గో ఇండియా ట్రస్ట్**
- **స్వామి వివేకానంద మాటలను ప్రతి ఒక్కరు అనుసరించాలి**



**చంద్రుగొండ అక్టోబర్ 16 ప్రజా జ్యోతి** ప్రపంచ ఆహార దినోత్సవాన్ని పునస్కరించుకుని గో ఇండియా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆహార దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం మండల పరిధిలోని మద్దుకూరు గ్రామంలో ఓ ప్రైవేట్ ట్యూషన్ నడుపుతున్న కృష్ణవేణి, రామకృష్ణ దంపతులు నిరుపేదలైన చిన్నారులకు చదువుతోపాటు భోజనాన్ని ఉచితంగా అందజేస్తున్నారు. వీరి కృషికి మెచ్చిన గో ఇండియా ట్రస్ట్ సభ్యులు మద్దుకూరు గ్రామంలో ఉన్న నిరుపేద చిన్నారులకు ప్రతిరోజు 50 మందికి ఉచితంగా ట్యూషన్ తో పాటు భోజనం అందించేందుకు ముందుకు వచ్చి ప్రతిరోజు చిన్నారులకు ఉచితంగా భోజనం అందజేస్తున్నారు. ఈ సందర్భంగా కృష్ణవేణి రామకృష్ణ దంపతులు మాట్లాడుతూ... ఆకలితో ఉన్నవారికి ముందు అన్నం పెట్టు,ఆ తర్వాత వేదం (చదువు) చెప్పు అని స్వామి వివేకానంద బోధించారని వారి స్ఫూర్తితోనే పిల్లలు ఎవరు ఆకలితో అలమటించకుండా గో ఇండియా ట్రస్ట్ ద్వారా పిల్లలకు ప్రతి రోజు ఆహార అందిస్తున్నామన్నారు. గో ఇండియా ట్రస్టు 20 ప్రాంతాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఉచితంగా పిల్లలకు భోజనాన్ని అందజేస్తున్నారన్నారు.

## అసంఘటిత కార్మిక సంఘ ఆర్గనైజింగ్ సెక్రటరీగా సుధాకర్



**టేకులపల్లి,అక్టోబర్16,ప్రజాజ్యోతి:** సింగరేణి కోల్ మైన్స్ లేబర్ యూనియన్ సెక్రటరీ జనరల్ బి.జనక్ ప్రసాద్ ఆదేశాలమేరకు గురువారం అసంఘటిత కార్మిక సంఘం ఇల్లందు ఇంచార్జ్ గోచికొండ సత్యనారాయణ కేఓసి లోని ఎల్ఎస్ఎన్ క్యాంపు లో వోల్వో ఆపరేటర్ గా పనిచేస్తున్నటువంటి ముచ్చ సుధాకర్ ను సింగరేణి కోల్ మైన్స్,ఔట్ సోర్సింగ్ లేబర్ యూనియన్ (ఐఎన్టియుసి యూనియన్ )అసంఘటిత కార్మిక సంఘం ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించారు. కెఓసి లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై పోరాటానికి, సంబంధిత అధికారులతో మాట్లాడడానికి సుధాకర్ ని నియమించడం జరిగింది, కె ఓ సి ప్రాజెక్ట్ ఆఫీసర్ చేతుల మీదగా సుధాకర్ కు నియామక పత్రాన్ని అందడం జరిగింది. ఈ సందర్భంగా ముచ్చ సుధాకర్ మాట్లాడుతూ కే ఓసి లో పనిచేస్తున్నటువంటి తోటి కార్మికులకు వెన్నంటే ఉంటూ బాయిలో పనిచేస్తున్న ఈ కార్మికుడికైనా సమస్య అంటే అక్కడ నేనుంటా అని ఆయన తెలిపారు. ఐఎన్టియుసి యూనియన్ నాకు అప్పగించినటువంటి బాధ్యతలను నమ్మకంతో నెరవేరుస్తానని, వారి నమ్మకాలను ఒమ్ము చేయనని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు ఏరియా వైస్ ప్రెసిడెంట్ జే.వెంకటేశ్వర్లు, జనరల్ సెక్రటరీ గోచికొండ సత్యనారాయణ,డిప్యూటీ జనరల్ సెక్రటరీ భూక్యా నాగేశ్వరరావు,పిట్ సెక్రటరీ కోసూరి సత్యనారాయణ, మేకల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలకు వంటపాత్రల విరాళం

- **ప్యూర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందజేత**




**జూలూరుపాడు, అక్టోబర్ 16 (ప్రజాజ్యోతి )** దసరా సెలవుల సమయంలో జూలరుపాడు ప్రభుత్వ ఉన్నత పాఠశాల జూలూరుపాడు నందు వంటపాత్రలు దొంగిలించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్యూర్ ఫౌండేషన్ సంస్థ పాఠశాలకు రూ.8,000 విలువైన వంటపాత్రలు విరాళంగా అందజేశారు ప్రధానోపాధ్యాయులు టీ.లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ తల్లిదండ్రులు పిల్లలపై చూపవలసిన బాధ్యతలు, ఉపాధ్యాయులు విద్యార్థులపై తీసుకోవలసిన కర్తవ్యాలు ఎంతో ముఖ్యమైనవి. విద్యార్థులు క్రమశిక్షణతో, కష్టపడి, గురువులను గౌరవిస్తూ విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థులు కూడా క్రమశిక్షణతో చదువుకుని, గురువులను గౌరవించి ఆశీస్సులు పొందలని చెప్పారు.పాఠశాల ,ప్యూర్ ఫౌండేషన్ సంస్థకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామిశెట్టి శ్రీనివాసరావు, నిమ్మగడ్డ ఉమా, సూరపనేని శాంతకుమారి, నంద్రు గురుమూర్తి, పి.రామనాథన్, బి.అరుణకుమారి, పి.ఉమామహేశ్వరి, బానోత్ సునీత, కేలోత్ లలిత, లకావత్ సర్దార్ వల్లభాయ్ పటేల్, జీవీఆర్ ప్రసాద్ రావు, గుండా నాగరమేష్, పి.ఉదయ్ సేతు, జిల్లా ఉపేంద్రమ్మ పాల్గొన్నారు.మధ్యాహ్న భోజన వంటకార్మికులకు కూడా వంటపాత్రలు అందజేశారు.

## మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య



**కొత్తగూడెం,అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** ప్రేమించిన అమ్మాయి దూరమైందనే బాధతో మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం గౌతంపూర్ లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..శంఖువార్ కార్తిక్ (25) ఐటిఐ అనంతరం అప్రెంటిషిప్ పూర్తి చేసుకున్నాడు. తాను గాఢంగా ప్రేమించిన అమ్మాయి సంవత్సరం క్రితం పెద్దలు కుదిర్చిన వివాహం చేసుకోవడంతో అప్పటినుంచి మద్యానికి బానిస అయ్యాడు. ఈ క్రమంలో రెండు పర్యాయాలు ఆత్మహత్య చేసుకునేందుకు ప్రయత్నించినా కుటుంబ సభ్యులు కార్తీక్ ను కాపాడారు. గురువారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.తండ్రి ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూ టౌన్ ఎస్సై మనీషా కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు



**జూలూరుపాడు అక్టోబర్ 16 ప్రజా జ్యోతి** జూలూరుపాడు మండలం కేంద్రంలో AVR ఫంక్షన్ హాల్ నందు జూలూరుపాడు మండలం భోజ్య తండా పంచాయతీలో రాజారావుపేట గ్రామానికి చెందిన నూతి నరసింహారావు – అరుణ దంపతుల కుమార్తె స్వాతి–ఉదయ్ చందుల నిశ్చితార్థ వేడుకలలో పాల్గొని నూతన జంటను ఆశీర్వదించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు యల్లంకి సత్యనారాయణ , వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు ఈ కార్యక్రమంలో సొసైటీ మాజీ చైర్మన్ బీఆర్ఎస్ పార్టీ జిల్లా సీనియర్ నాయకులు పోలుదాస్ క్రిష్ణమూర్తి, సొసైటీ డైరెక్టర్ చాపలమడుగు రామ్మూర్తి, బీఆర్ఎస్ పార్టీ మండల నాయకులు తాళ్లూరి రామారావు, పురస్తపురవు రామకృష్ణ, పోతురాజు కృష్ణ భూక్యా దేవిలాల్, నూతి నరసింహారావు, నూతి శేషయ్య, బుడిగ రామారావు మరియు తదితరులు నాయకులు పాల్గొన్నారు.

## బీసీ బందుకు ముస్లిం మైనార్టీ సంపూర్ణ మద్దతు

- ఎస్.కె ఫహీమ్ దాదా



**కొత్తగూడెం,అక్టోబర్ 16 (ప్రజాజ్యోతి ):** బీసీ రిజర్వేషన్ల సాధనకు వివిధ బీసీ సంఘాలతో ఏర్పడిన బీసీ జేఏసీ బంద్ పర్ జస్టిస్ పేరుతో ఈనెల 18న తలపెట్టిన రాష్ట్ర బందుకు ముస్లిం మైనార్టీ లో సంపూర్ణ మద్దతు ప్రకటించింది రామవరం ఈద్గా ఖబర్ఖాన్ కమిటీ అధ్యక్షులు ఫహీమ్ దాదా మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు సాధనకు తెలంగాణ ఉద్యమ తరహాలోనే ఒక సామాజిక ఉద్యమంగా ముందుకు రాగలన్నారు, బిసి బిల్లును ఆమోదించి రిజర్వేషన్లను అమలు చేయాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వం పైన ఉందన్నారు, గవర్నర్ వద్ద పెండింగ్ ఉన్న బిల్లులు నిర్ణయిత కాల పరిమితిలోగా ఆమోదం లభించేయకపోతే నోటుపై చేయవచ్చని తమిళనాడు కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును పరిశీలించాలన్నారు, రాష్ట్రం నుండి ప్రతినిత్యం వహిస్తున్న బిజెపి ఎంపీలు మంత్రులు కేంద్రంపై ఒత్తిడి తేవడానికి ఎలాంటి ప్రయత్నం చేయడం లేదన్నారు కేంద్రంలో అధికారంలో బిజెపి ఉండటం వల్లనే రిజర్వేషన్లు అమలు కానీ పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు. బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు కావాలంటే రాష్ట్రంలో కేంద్రంలో బిజెపిని భూస్థాపితం చేయాలన్నారు. ఈ సమావేశంలో సెక్రెటరీ రసూల్ పాషా, షమీరుద్దీన్, అసాద్, జావీద్, ఖయ్యూం, సూపర్ ఖురేషి, ఉస్మాన్, అంకుష్, మస్తాన్, మజీద్, జలీల్, జానీ, సలీం, యాకూబ్, ఇస్మాయిల్, సుల్తాన్, తదితరులు పాల్గొన్నారు.

# ఉల్వనూర్ గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల దయనీయ పరిస్థితి.

- విద్య,భోజనం సౌకర్యాలు లేక ఇంటిదారి పట్టిన గిరిజన విద్యార్థులు.
- అధికారుల నిర్లక్ష్యం కారణంగా విద్యార్థుల ఇబ్బందులు.
- సమ్మె చేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని లంబాడి హక్కుల సమితి-గుగులోత్ కుశ నాయక్



**పాల్వంచ(రూరల్) అక్టోబర్ 16(ప్రజా జ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలంలోని ఉల్వనూర్ గిరిజన ఆశ్రమ పాఠశాల హాస్టల్లో విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యా సౌకర్యాలు, భోజన సదుపాయాలు లేకపోవడంతో పలువురు విద్యార్థులు హాస్టల్‌ను విడిచి ఇంటిదారి పట్టారు. లంబాడి హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి గుగులోత్ కుశ నాయక్ తెలిపారు.హాస్టల్లో విద్యార్థుల పరిస్థితి దయనీయంగా ఉందని.ఆదివాసీ అభివృద్ధి ఏజెన్సీ (ఐటిడిఏ) అధికారులు సరైన పర్యవేక్షణ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని ఆయన అన్నారు.కార్మికులు సమ్మె చేస్తున్నప్పటికీ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోకపోవడంతో పిల్లలు ఆకలితో ఇబ్బంది పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టల్ వార్డెన్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించారని,పిల్లల భవిష్యత్తుతో ఆడుకుంటున్న వారిపై తక్షణంగా సస్పెండ్ చేసి విచారణ జరపాలని జిల్లా కలెక్టర్ గారిని లంబాడి హక్కుల పోరాట సమితి నేతలు కోరారు.గత 35 రోజులుగా సమ్మె చేస్తున్న దైనందిన కూలీ కార్మికులకు న్యాయం చేయకపోవడం,వారికి కనీస వేతనాలు ఇవ్వకపోవడం,ఈ పరిస్థితికి కారణమని కుశ నాయక్ పేర్కొన్నారు.పూర్తి సమయం పనిచేస్తున్న కార్మికులకు పూర్తి వేతనాలు, స్థిర వేతన విధానం (టైం స్కేలు) కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు వెంటనే స్పందించకపోతే, జిల్లా వ్యాప్తంగా అన్ని హాస్టళ్ల ముందు, భద్రాచలం ఆదివాసీ అభివృద్ధి కార్యాలయం వద్ద అన్ని కుల సంఘాలతో కలిసి సంయుక్త చర్యల కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేసి మహా ధర్నా చేపడతామని గుగులోత్ కుశ నాయక్ హెచ్చరించారు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలి

- 18వ జరిగే బంద్ ను జయప్రదం చేయండి
- పిఓఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పిలుపు



**టేకులపల్లి,అక్టోబర్16,ప్రజాజ్యోతి:** బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని తెలంగాణ ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ ప్రభుత్వాని కోరారు.<టేకులపల్లి మండలం సిపిఐ ఎంఎల్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పివై ఎల్ రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ మాట్లాడుతూ బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవో నెంబర్ 9 ని హైకోర్టు కొట్టి వేసింది. ఈ నేపథ్యంలో లో రాష్ట్రంలో బిసి సంఘాల ఐక్య వేదిక రాజ్యాంగంలోని తొమ్మిదో షెడ్యూల్ లో యీ రిజర్వేషన్లు చేర్చడం ద్వారా దీన్ని సాకారం చేయలని డిమాండ్ తో ఈ నెల 18న రాష్ట్ర బంద్ కి పిలుపునిచ్చింది. న్యాయబద్ధమైన ఈ బంద్ పిలుపుకి రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు,కుల సంఘాలు మద్దతు ఇచ్చి ఐక్యంగా పాల్గొన్ని బంద్ను విజయవంతం చేయాలని ప్రగతిశీల యువజన సంఘం పి వై ఎల్ కోరుతున్నాది. కేంద్ర ప్రభుత్వం ఈ న్యాయమైన డిమాండ్ ని రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్ లో చేర్చి రాష్ట్రం లో బిసి లకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని కోరుతున్నారు అని ఆయన అన్నారు. రాష్ట్రం లో అన్ని రాజకీయ పార్టీలు శాసనసభలో ఏక గ్రీవంగా ఆమోదం తెలిపినా ఇటు రాష్ట్ర గవర్నర్ కానీ,అటు కేంద్ర ప్రభుత్వం గాని పట్టించుకోకపోవడం వల్ల నోటి కాడి ముద్దను లాగేసుకున్నట్లు గా బిసి ప్రజలు నేడు భావిస్తున్నారు.కాబట్టి 18 న జరిగే బంద్ కు రాజకీయాలకు అతీతంగా అన్ని పార్టీలు, సంఘాలు,సంస్థలు, మేధావులు,యువకులు, విద్యార్థులు పాల్గొని సంపూర్ణ మద్దతు తెలియజేయలని ఆయన కోరారు.

## జగదాంబ సేన ఆధ్వర్యంలో చలో తిరుపతి



**జూలూరుపాడు, అక్టోబర్ 16 (ప్రజాజ్యోతి ):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండల కేంద్రంలో జగదాంబ సేన వ్యవస్థాపక అధ్యక్షుడు తేజావత్ రాములు మహారాజు పాల్గొని చలో తిరుపతి కార్యక్రమానికి పిలుపునిచ్చారు హాథిరామ్ బావాజీ కి ఈనెల 18,19 తేదీలలో తిరుపతిలో మహా భోగ్ బండారు జరుగుతుందని అట్టి కార్యక్రమాన్ని సాధుసమతులు కలిసి రావాలని విజయవంతం చేయాలని కరపత్రాలను ప్రతి సాధువులకు అందిస్తూ జగదంబ సేన పిలుపునిచ్చింది ఈ కార్యక్రమంలో జిల్లా సంఘం నాయకులు శంకర్ సాదు గురు సాధు అనిల్ కుమార్ నాయక్ కుమార్ నాయక్ మరియు సాధులు మహిళలు పాల్గొన్నారు పాల్గొన్నారు

## శ్రీ దుర్గా మాత ఆలయంలో సహపంక్తి భోజనాలు

- అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన - జి.యం దంపతులు



**టేకులపల్లి,అక్టోబర్16,ప్రజాజ్యోతి:** ఇల్లందు ఏరియా కెఓసి లోని దుర్గాభవాని మాత ఆలయ కమిటి ఆధ్వర్యంలో శ్రీ దుర్గాదేవి నవరాత్రులలో భాగంగా సహపంక్తి భోజనాలను గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ముఖ్య అతిదిగా ఇల్లందు ఏరియా జి.యం. వి.కృష్ణయ్య–రమ దంపతులు విచ్చేసి శ్రీ దుర్గా భవాని మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం సహపంక్తి భోజనాలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో యస్.ఓ.టూ జి. యం. రామస్వామి, ఏజియం ఐ ఈ డి గిరిధర్ రావు, డీజియం పర్సనల్ అజీర తుకారాం, శివ వీర కుమార్, సతీష్ కుమార్, సెక్యూరిటీ అధికారి అంజి రెడ్డి, సి.యం.ఓ.ఎ అద్యశులు ఎ.జి. శివ ప్రసాద్, సీనియర్ పి. ఓ. యస్. అశోక్,గుర్తింపు సంఘం నుంచి హరిసింగ్, కె.వెంకటేశ్వర్లు, ప్రతినిధ్య సంఘం నుంచి కె. సత్యనారాయణ,భూక్య నాగేశ్వరావు, ఇతర అధికారులు ఉద్యోగులు,ఆలయకమిటి సభ్యులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## చెరువులో పడి వ్యక్తి మృతి



**బూర్గంపహాడ్, అక్టోబర్16, (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలం తాళ్లగొమ్మూరు గ్రామ శివారులోని చెరువు కుంటలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... బూర్గంపహాడ్ మండలం సారపాక లోని మేడే కాలనీకి చెందిన ధరావత్ నంద నాయక్ గత కొంత కాలం నుండి మతిస్థిమితం సరిగా లేక తిరుగుతున్నాడు. బుధవారం మధ్యాహ్నం ఇంటి నుండి వెళ్లి రాత్రి సమయంలో మతిస్థిమితం సరిగా లేక మరియు ఫిట్స్ ఉండడం వలన ప్రమాదవశాత్తు తాళ్లగొమ్మూరు గ్రామ శివారు చెరువు కుంటలో పడి మృతి చెందాడు. అతని భార్య ధరావత్ లీల ఫిర్యాదు మేరకు బూర్గంపహాడ్ ఎస్ఐ నాగబిక్షం కేసు నమోదు చేసి,దర్యాప్తు చేస్తున్నారు.

## అక్రమ గ్రావెల్,ఇసుక రవాణాను అరికట్టాలి

- పాయం సత్యనారాయణ



**చర్ల, అక్టోబర్ 16:(ప్రజా జ్యోతి ):** <చర్ల మండలంలో బుధవారం మండల తాసిల్దార్ కార్యాలయంలో అక్రమ గ్రావెల్ ఇసుక తోలకాలను రెవెన్యూ అధికారులు మైనింగ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మండల తాసిల్దార్ శ్రీనివాస్ కి వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భగా వారు మాట్లాడుతూ ఏజెన్సీలో బలమైన చట్టాలు ఉన్నప్పటికీ చట్టం ప్రకారంగా అధికారులు కూడా పనిచేయడం లేదని చట్టాలు కాగితాలకే పరిమితం అవు తున్నాయని ఆరోపించారు.భద్రాచలం నియోజకవర్గం లో ఇద్దరు ఐఏఎస్ ఆఫీసర్లు ఉన్నప్పటికీ. ఐటీడీఏ పీవో. భద్రాచలం సబ్ కలెక్టర్. ఏజెన్సీ చట్టాల మీద ఏ మాత్రం దృష్టి సారిం చడం లేదని మండిపడ్డారు.ఏజెన్సీలో భూమి సమస్యలు అనేకం ఉన్నప్పటికీ వాటి పరిష్కారానికి అధికారులు చొరవ చూపడం లేదని.. ఉదాహరణకు ప్రధానంగా కుదునూరు పోడు భూమి సమస్య 14 సంవత్సరాల నుండి ఇంకా జటిలంగానే ఉందని. ఎన్నిసార్లు ఈ సమస్యపై పిఓ కి మెమోరాండం ఇచ్చినప్పటికీ ఆ సమస్యను పరిష్కరించటం లేదని అన్నారు . ఈ కార్యక్రమం లో చర్ల మండల ఆదివాసి జేఏసీ చైర్మన్ తాటి రామకృష్ణ . ఇర్పా ప్రకాష్. పూణేం వర ప్రసాద్. మాజీ ఎంపీపీ గొంది మొయ్యన్న. పూణెం రామారావు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతం దిశగా అడుగులు

- ఘనంగా సంఘటన్ సృజన్ అభియాన్ కార్యక్రమం
- ముఖ్య అధితులుగా ఎమ్మెల్యే జారే , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పొదెం వీరయ్య, ఏఐసీసీ పరిశీలకులు జాన్సన్ అబ్రహాం



**దమ్మపేట, అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా, పార్టీ కార్యకర్తల్లో చైతన్యం నింపుతూ, కొత్త నాయకత్వాన్ని ముందుకు తీసుకురావడమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "సంఘటన్ సృజన్ అభియాన్" కార్యక్రమం దమ్మపేట మండలం, పట్వారి గూడెం గ్రామంలోని చెలికాని ఆదెమ్మ ఫంక్షన్ హాల్ లో గురువారం రోజు ఘనంగా నిర్వహించబడింది.<ఈ కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు శ్రీ పొదెం వీరయ్య అధ్యక్షత వహించగా, అశ్వారావుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ, భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల ఏఐసీసీ పరిశీలకులు జాన్సన్ అబ్రహాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాట్లాడుతూ, అశ్వారావుపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణ వేగంగా జరుగుతోందని, ప్రతి గ్రామం వరకు పార్టీ బలోపేతం కోసం కృషి కొనసాగుతుందని తెలిపారు. పార్టీకి కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు తప్పకుండా వస్తుందని, కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ తమ కార్యకర్తల వెన్నంటి నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీకి కట్టుబడి పనిచేసే ఎస్.సి., ఎస్.టి., బి.సి., మైనారిటీలు, మహిళలు, యువత వంటి వర్గాలకు ప్రాధాన్యత ఇస్తూ, వారిని నాయకత్వ స్థాయిలో ముందుకు తీసుకురావడం పార్టీ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రతి జిల్లా కాంగ్రెస్ కమిటీని చురుకైన నాయకులతో బలోపేతం చేసి, గ్రామ స్థాయిలో కొత్త కమిటీలను ఏర్పాటు చేయడం ద్వారా కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను ప్రజల దరిదాపులకు చేర్చే చర్యలు తీసుకుంటున్నామని వారు వివరించారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పొదెం వీరయ్య మాట్లాడుతూ, ప్రతి మండలం, గ్రామం, బూత్ స్థాయిలో కొత్త కమిటీలు ఏర్పాటు చేసి పార్టీ నిర్మాణాన్ని దృఢంగా చేయనున్నామని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారమే పార్టీ ధ్యేయమని, ప్రజల్లో కాంగ్రెస్ పునరాగమనానికి ఈ కార్యక్రమం వేదికగా నిలుస్తుందని అన్నారు. ఏఐసీసీ పరిశీలకుడు జాన్సన్ అబ్రహాం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి కొత్త దిశా నిర్దేశం జరుగుతోందని, యువతలో రాజకీయ చైతన్యం పెంచడంలో ఈ కార్యక్రమం కీలకంగా మారిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కేవలం ఓ రాజకీయ సంస్థ మాత్రమే కాకుండా, ప్రజల హక్కుల కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం పోరాడే ఉద్యమశక్తి అని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ పునరుద్ధరణ దిశగా ఇది అత్యంత ముఖ్యమైన ఉద్యమమని పేర్కొన్నారు. భారత దేశం అంతటా కాంగ్రెస్ పార్టీని ప్రజల నమ్మకాన్ని తిరిగి గెలుచుకునే దిశగా "సంఘటన్ సృజన్ అభియాన్" ద్వారా కొత్త ఉత్సాహాన్ని నింపుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా కాంగ్రెస్ పార్టీకి కొత్త ఊపిరి పోసి, ప్రజల సమస్యలపై స్పందించే ఉద్యమానికి దారితీస్తుందని నాయకులు నమ్మకమ వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ ప్రధాన నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ స్థాయి నాయకులు, మహిళా నాయకులు, యువకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీకి కు మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ పేరు

- కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ కు మన్మోహన్ సింగ్ పేరు పెట్టాలని క్యాబినేట్ నిర్ణయం
- ముఖ్యమంత్రి "రేవంత్"కు కృతజ్ఞతలు తెలిపిన మంత్రి " తుమ్మల
- తెలంగాణ క్యాబినెట్ కీలక నిర్ణయం తో
- ఆనందోత్సవాల్లో ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రజలు

•

**కొత్తగూడెం కలెక్టరేట్, అక్టోబర్ 16, ప్రజా జ్యోతి** తెలంగాణ ప్రభుత్వం మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. భద్రాద్రి కొత్తగూడెం ఎర్త్ సైన్సెస్ విశ్వవిద్యాలయాన్ని భారత మాజీ ప్రధానమంత్రి, ఆర్థిక సంస్కరణల శిల్పి డా. మన్మోహన్ సింగ్ పేరుతో ఏర్పాటు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన గురువారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో "మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" తెలంగాణ విద్యా చరిత్రలో ఒక మైలురాయిగా నిలిచింది ,రాష్ట్ర ప్రభుత్వం చూపిన దూరదృష్టి, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన కృషి చరిత్రలో నిలిచిపోతుందని చెప్పవచ్చు ,ఈ నిర్ణయం వెలువడగానే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఉత్సాహం నెలకొంది. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల సీఎం రేవంత్ రెడ్డి, క్యాబినెట్ మంత్రులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**మైనింగ్ కళాశాల నుండి విశ్వవిద్యాలయం...**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ దేశంలోనే ఎక్కడాలేని విధంగా 300 ఎకరాలలో విశ్వవిద్యాలయం రూపుదిద్దుకుంది. అయితే ఇప్పటికే కొత్తగూడెం మైనింగ్ కళాశాలను అప్ గ్రేడ్ చేస్తూ "ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ"గా కాంగ్రెస్ ప్రభుత్వం మార్పు చేసింది. ఇప్పుడు విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ పేరు పెట్టడం విద్యా వ్యవస్థలో తన దృష్టికోణాన్ని మరింత స్పష్టంగా ప్రభుత్వం తెలియజేసినట్టయింది.

**మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విశేష కృషి...**

ఎర్త్ సైన్సెస్ కళాశాలను డా. మన్మోహన్ సింగ్ పేరు మీద ఏర్పాటు చేయడంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కీలక పాత్ర పోషించారు. మైనింగ్ కళాశాలను విశ్వవిద్యాలయంగా మార్చడంలోనూ, మన్మోహన్ సింగ్ పేరు ఖరారు చేయడంలోనూ ఆయన విశేష కృషి చేశారు. తమ జిల్లాకు విశ్వవిద్యాలయం దక్కడం ద్వారా తాను కలగన్న స్వప్నం సాకారమైందని తుమ్మల పేర్కొన్నారు. "రేవంత్ సర్కార్ తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణ విద్యా రంగానికి కొత్త దిశను చూపుతుంది" అని మంత్రి హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యంగా తాను ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా విద్యార్థులకు మంచి విద్యావకాశాలు లభించే అవకాశాలు ఏర్పాడుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

**300 ఎకరాల్లో అద్భుత ప్రాజెక్ట్ – దేశానికే తలమానికం...**

సింగరేణి స్కూల్ ఆఫ్ మైన్స్ ఉన్న స్థావరంలోనే 300 ఎకరాల విస్తీర్ణంలో "మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ" రూపుదిద్దుకుంటోంది. అత్యాధునిక ల్యాబ్ లు, అంతర్జాతీయ ప్రమాణాల పరిశోధనా సౌకర్యాలతో ఈ విశ్వవిద్యాలయం దేశంలోనే ఒక ప్రత్యేక మోడల్ గా నిలవనుంది. ఇక్కడి నుండి వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యా, శాస్త్ర పరిశోధనల్లో ముందంజ వేయనున్నారు. భూవిజ్ఞానం, ఖనిజ వనరుల వినియోగం, పర్యావరణ సంరక్షణ వంటి రంగాల్లో పరిశోధనలు కొనసాగనున్నాయి.

**భవిష్యత్తు తరాల కోసం శాస్త్రీయ కేంద్రం...**

ఈ విశ్వవిద్యాలయంలో జియోకెమిస్ట్రీ, జియోఫిజిక్స్, ప్లానెటరీ జియాలజీ, స్ట్రక్చరల్ జియాలజీ, పర్యావరణ భూగర్భశాస్త్రం వంటి కోర్సులు అందుబాటులోకి రానున్నాయి. భూగర్భ వనరుల పరిశోధనకు, దేశ సుస్థిర అభివృద్ధికి ఇది ప్రధాన కేంద్రమవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

**భద్రాద్రి కొత్తగూడెం.. ఖనిజ సంపదకు నూతన గుర్తింపు...**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సహజ వనరులు, బొగ్గు , ఖనిజాలతో సమృద్ధిగా ఉంది. ఇది దక్షిణ భారతదేశానికి "ఖనిజ నిధి"గా పరిగణించబడుతోంది. ఈ ప్రాంతంలో నేషనల్ హైవేకు సమీపంగా 300 ఎకరాల విస్తీర్ణంలో ఈ విశ్వవిద్యాలయం ఏర్పాటవుతోంది. సమీపంలో ఐటీసీ పేపర్ బోర్డు, హెవీ వాటర్ ప్లాంట్, నావా లిమిటెడ్, ఫెరో ఎల్లాయ్ పరిశ్రమలు, విద్యుత్ ప్లాంట్లు ఉన్నాయి. అదేవిధంగా, 20 కిలోమీటర్ల దూరంలో ప్రతిపాదిత విమానాశ్రయం కూడా రానుంది. గోదావరి నది సమీపంలో ఉండడం వలన నీటి సమస్యలు ఉండవు.

**ఉపాధి అవకాశాల పునరుజ్జీవనం....**

విశ్వవిద్యాలయం ఏర్పాటుతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిరుద్యోగ యువతకు కొత్త అవకాశాలు లభించనున్నాయి. వేలాది మంది విద్యార్థులు ఉన్నత చదువులు పూర్తి చేసి పరిశోధన, పరిశ్రమల రంగాల్లో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. అంతేకాకుండా ప్రత్యక్షంగా, పరోక్షంగా అక్కడి ప్రజలకు ఉపాధి అవకాశాలు లభించే అవకాశం ఉంటుంది.

**జాతీయస్థాయి గుర్తింపు – గర్వకారణం తెలంగాణకు....**

మన్మోహన్ సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఏర్పాటుతో తెలంగాణ విద్యా రంగం జాతీయస్థాయిలో కొత్త గుర్తింపు పొందనుంది. మాజీ ప్రధాని గౌరవార్థం ఈ పేరు పెట్టడం రాష్ట్రానికి గౌరవకారణం. భద్రాద్రి కొత్తగూడెం పేరు ఇకపై జాతీయ స్థాయిలో మారు మ్రోగనుంది.

**ఉమ్మడి ఖమ్మం జిల్లాలో సంబరాలు....**

తెలంగాణ క్యాబినెట్ నిర్ణయంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆనందోత్సాహం వెల్లివిరిసింది. ప్రజలు, విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ప్రజా ప్రతినిధులు విశ్వవిద్యాలయానికి మన్మోహన్ సింగ్ పేరు రావడం పట్ల గర్వంగా భావిస్తున్నారు. విద్యార్థి సంఘాలు, ప్రజాసంస్థలు, విద్యావేత్తలు హర్షం వ్యక్తం వ్యక్తం చేశారు

## ప్రగతిశీల భావాజాలం కలిగిన వ్యక్తి సబ్బతి విష్ణుమూర్తి

- ఏసీపీ విష్ణుమూర్తి సంస్కరణ సభ లో మాట్లాడుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి,
- కొత్తగూడెం నియోజకవర్గం శాసనసభ్యులు



**జూలూరుపాడు, అక్టోబర్ 16 ప్రజాజ్యోతి:** జూలూరుపాడు మండలంలో విద్యార్థి దశలో నుండి ఏఐఎస్ఎఫ్ లో విద్యార్థి ఉద్యమాలకు నాయకత్వం వహించిన ధైర్యశాలి, విష్ణుమూర్తి మరణం బాధాకరమని వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు అన్నారు గురువారం వారి నివాసంలో ఏర్పాటు చేసిన సంస్మరణ సభలో వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం సంస్మరణ సభ ను ఉద్దేశించి మాట్లాడుతూ పోలీసు వృత్తిలో ఎన్నో కష్టాలు ఎదురైనా ఎప్పుడూ నవ్వుతూ ధైర్యంగా ముందుకు సాగిన వ్యక్తి తన సహజ స్వభావం వల్ల సర్వీస్ లో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్న ధైర్యంగా ముందుకు సాగే ధైర్యశాలి విష్ణుమూర్తి అని , పేద ప్రజల పట్ల తన వంతు సహాయ సహకారాలు అందించే వ్యక్తి విష్ణుమూర్తి అని వారి మరణం పట్ల ప్రగాఢ సానుభూతి సంతాపం తెలిపారు వారి కుటుంబ సభ్యులకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు చంద్ర నరేంద్ర కుమార్ సీపీఐ జిల్లా సమితి సభ్యులు గుండెపిన్ని వెంకటేశ్వర్లు సీపీఐ నాయకులు ఎల్లంకి మధు , sk చాంద్ పాషా సిరిపురపు వెంకటేశ్వర్లు ,పొనేకంటి వెంకటేశ్వర్లు వల మల్ల సామేలు, కిలారి ముత్యాలు, గుడిమెట్ల సీతయ్య గుండె పిన్ని మధు కొండ వీరయ్య పాల్గొన్నారు.

## దశ దిన కర్మ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు



**జూలూరుపాడు అక్టోబర్ 16 ప్రజా జ్యోతి** జూలూరుపాడు మండలం గుండ్లరేవు గ్రామ పంచాయతీ రాంపురం గ్రామంలో ఇటీవల మరణించిన బానోత్ భద్రు దశ దిన కర్మ కార్యక్రమంలో వైరా నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ నాయకులు లకావత్ గిరిబాబు పాల్గొని, వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ చాపలమడుగు రామ్మూర్తి బీఆర్ఎస్ పార్టీ నాయకులు బానోత్ చందర్, ధరావత్ రామచందర్, భూక్యా మహేష్, భూక్యా దేవిలాల్ నాయక్, నాయకులు పాల్గొన్నారు

## నూతన పదవీ బాధ్యతలు స్వీకరించిన ఎస్సైకి సన్మానం



**టేకులపల్లి, అక్టోబర్16, ప్రజాజ్యోతి:** మండలంలోని బోడు స్టేషన్ లో నూతనం గా బాధ్యతలు చేపట్టిన పి. శ్రీనివాస్ రెడ్డి ని గురువారం మొక్కంపాడు తండా యువకులు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసి, శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో టీచర్ బానోత్ రవి, భూక్య సుభాష్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ మాలోత్ రాందాస్,యువకులు మోహన్,సందీప్,వసంత్ తదితరులు పాల్గొన్నారు.

## బాణాసంచా విక్రయాలకు ముందస్తు అనుమతి తప్పనిసరి - దమ్మపేట పోలీసులు

- నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు - ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి




**దమ్మపేట, అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** దీపావళి పండుగ సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని, బాణాసంచా విక్రయాలపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని దమ్మపేట పోలీసులు సూచించారు. ఈ సందర్భంగా దమ్మపేట ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి పత్రికలకు వెల్లడిస్తూ, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో తాత్కాలిక బాణాసంచా (టపాకాయల) దుకాణాలు ఏర్పాటు చేయదలచిన వ్యాపారులు తప్పనిసరిగా ముందుగా అధికార అనుమతి పొందవలసిందిగా విజ్ఞప్తి చేశారు. బాణాసంచా విక్రయం ఒక సున్నితమైన వ్యవహారం కావున భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించడం అవసరమని చెప్పారు. వ్యాపారులు పాల్వంచ సబ్ డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకుని, అవసరమైన పత్రాలు సమర్పించి ముందస్తుగా అనుమతి తీసుకోవాలని సూచించారు. దరఖాస్తు సమయంలో టపాకాయల నిల్వ స్థలం, షాప్ ప్రదేశం, భద్రతా చర్యలు, అగ్నిమాపక పరికరాలు మొదలైన వివరాలు సక్రమంగా ఇవ్వాల్సి ఉంటుందని తెలిపారు. దరఖాస్తుల పరిశీలన అనంతరం భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న వ్యాపారులకు మాత్రమే అనుమతులు జారీ చేయబడతాయని తెలిపారు.ఎటువంటి అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేసే వారిపై పేలుడు పదార్థాల చట్టం – 1884, పేలుడు పదార్థాల నియమాలు – 1933 (సవరణ 2008) ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించారు. అనుమతి లేని విక్రయ కేంద్రాలు ప్రజా ప్రాణాలకు ముప్పుగా మారవచ్చని పోలీసులు హెచ్చరిక జారీ చేశారు.

**టపాకాయల దుకాణాదారులు తప్పక పాటించవలసిన నిబంధనలు:**

* టపాకాయల దుకాణాలు ఖాళీ మరియు సురక్షిత ప్రదేశాలలో మాత్రమే ఏర్పాటు చేయాలి. ఆ ప్రదేశానికి సంబంధించి స్థానిక అధికారులు ఇచ్చిన ఎన్.ఓ.సి. సర్టిఫికేట్ తప్పనిసరిగా సమర్పించాలి.

* ఒకే క్లస్టర్ లేదా ప్రాంతంలో 50 షాపులకు మించకుండా మాత్రమే ఏర్పాటు చేయాలి.

* జనసంచారం ఎక్కువగా ఉండే ప్రదేశాలు, మార్కెట్లు, కళ్యాణ మండపాలు, పాఠశాలలు, సమావేశ కేంద్రాలు వంటి ప్రాంతాలలో టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయరాదు.

* ప్రతి తాత్కాలిక టపాకాయల షాపులో అగ్నిమాపక పరికరాలు (ఫైర్ ఎక్స్టింగ్విషర్) తప్పనిసరిగా ఉండాలి. అలాగే విద్యుత్ కనెక్షన్లు సురక్షితంగా అమర్చబడాలి.


* షాప్‌లో టపాకాయల నిల్వ పరిమితి ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా మాత్రమే ఉండాలి. అధిక పరిమాణంలో బాణాసంచా నిల్వ ఉంచరాదు.

* పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తును పాల్వంచ డిఎస్పీ కార్యాలయంలో సమర్పించి, అనుమతి పత్రం పొందిన తర్వాత మాత్రమే షాప్ ప్రారంభించాలి.

ప్రజల భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని,అనుమతి లేకుండా టపాకాయల షాపులు ఏర్పాటు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ సాయి కిషోర్ రెడ్డి హెచ్చరించారు. అలాగే బాణాసంచా కొనుగోలు చేసే ప్రజలు కూడా భద్రతా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పిల్లలు, పెద్దల పర్యవేక్షణలో మాత్రమే టపాకాయలు కాల్చాలని, అగ్ని ప్రమాదాలను నివారించే చర్యలు తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.దీపావళి పండుగ ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవడానికి ప్రతి ఒక్కరూ పోలీసుల సూచనలను తప్పక పాటించాలని ఆయన పిలుపునిచ్చారు.

## జిల్లా కోర్టు నిర్మాణానికి 10 కోట్లు మంజూరు

- ఫలించిన కూనంనేని కృషి
- హర్షం వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు, జిల్లా ప్రజలు
- 10 ఎకరాల్లో నిర్మాణం కానున్న ఆధునిక కోర్టు భవనాలు



**కొత్తగూడెం,అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** జిల్లా కోర్టు నూతన భవనసముదాయాల నిర్మాణానికి 10 కోట్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం ఉన్న కోర్టు భవనాలు శిథిలావస్థకు చేరడం, అసౌకర్యంగా ఉండటంతో స్థానిక శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ఆధునిక నూతన నిర్మాణాలకు చేసిన కృషి ఫలించింది. టెన్ ప్లస్ టూ జిల్లా కోర్టు భవనాలు, పోక్సో అండ్ ఫ్యామిలీ కోర్టులతో సహా నిర్మాణాలు చేపట్టేందుకు ఆర్ అండ్ బి, రాష్ట్ర ఆర్కిటెక్ట్ వింగ్ నుంచి సత్వరమే చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ భవనాలను పట్టణ పరిధిలోని కొత్తగూడమే ప్యూన్ బస్తి ఏరియా సర్వే నెంబరు 143లోని 10 ఎకరాల స్థలంలో నిర్మించనున్నారు. గౌరవ తెలంగాణ హై కోర్ట్ ఆదేశాల మేరకు, పూర్తిస్థాయి ప్రాజెక్టు రిపోర్టు సిద్ధం చేయడం, సాయిల్ టెస్టు, లేఅవుట్ ప్రణాళిక, నిర్మాణ రూపకల్పన సిద్ధం చేయడానికి కన్సల్టెంట్లు నియామకానికి ఆర్ అండ్ బి శాఖ ఇప్పటికే టెండర్లు ప్రకటించింది.ఈ టెండర్ ప్రక్రియను కొత్తగూడెం ఆర్ అండ్ బి సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ చేపట్టనున్నారు. త్వరలో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసికొని నిర్మాణాలు చేపట్టనున్నారు. కోర్టు భవన సముదాయాలు పూర్తయితే జిల్లా న్యాయవ్యవస్థకు ఆధునిక మౌలిక సదుపాయాలు సమకూరనున్నాయి. నూతన భవన నిర్మాణాలకు, స్థల సేకరణకు కృషిచేసి ఎమ్మెల్యే కూనంనేనికి న్యాయవాదులు, జిల్లా ప్రజలు, వివిధ వర్గాల ప్రజల నుంచి అభినందనలు తెలిపారు.

## ఏబిఆర్ యూత్ ఆధ్వర్యంలో క్రీడాకారిణి సృజనకు ఘన సన్మానం



**బూర్గంపహాడ్ అక్టోబర్16,(ప్రజా జ్యోతి):** మండల కేంద్రమైన బూర్గంపహాడ్ లోని పాండవుల బస్తీకి చెందిన క్రీడాకారిణి మేక సృజన ను బూర్గంపహాడ్ అంబేద్కర్ (ఏబిఆర్) యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించి సత్కరించారు. గురువారం పాండవుల బస్తీలో జరిగిన సన్మాన కార్యక్రమంలో మేక సృజనను ఏబిఆర్ యూత్ పెద్దలు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కేక్ ను కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఏబిఆర్ యూత్ పెద్దలు మాట్లాడుతూ మేక సృజన అండర్ –19 ఫుట్ బాల్ రాష్ట్ర మహిళా జట్టుకు ఎంపిక కావటం చాలా సంతోషకరమని వారు అన్నారు. ఫుట్ బాల్ క్రీడల్లో మరింతగా రాణించి జాతీయ జట్టులో సైతం చోటు సంపాదిం చుకోవాలని ఆకాంక్షించారు. సృజ నాకు అంతా మేలే జరగాలని, చదువులో మం చి జరగా లని, ఉన్నతమైన స్థానాలను అధిరోహించాల ని వారు కోరారు. గ్రామానికి, తల్లిదం డ్రులకు, గురువులకు మంచి పేరును తెచ్చి పెట్టాలని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీఆర్ యూత్ పెద్దలు సీనియర్ జర్న లిస్టు తోకల మోహన్ రావు, యూత్ పెద్దలు కేసుపాక పుల్లయ్య, తోకల రవి ప్రసాద్, సిపిఎం మండల నాయకులు రాయల వెంకటేశ్వర్లు, యూత్ నాయకులు, సభ్యులు కేసుపాక రాజేష్, అలవాల దుర్గాప్రసాద్,నందిపాటి వెం కటేశ్వర్లు, కేసుపాక రఘురామ్, తోకల సారయ్య,దుర్గాప్రసాద్, తోకల పవన్, గోడ్ల వెంకటే శ్వర్లు, ఇనపనూరి వెంకటేశ్వర్లు, మాగంటి కార్తీక్, ఆకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన గురుకులంలో ఎలకలమందు తాగిన విద్యార్థిని

**భద్రాచలం, అక్టోబరు 16,ప్రజాజ్యోతి :** భద్రాచలంలోని గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ప్రధమ సంవత్సరం చదువుతున్న ఓ విద్యార్థిని గురువారం కళాశాల వసతి గృహంలో ఎలకల మందు తాగింది. దీంతో గమనించిన కళాశాల విద్యార్థులు వార్డెన్కు సమాచారం ఇవ్వడంతో భద్రాచలం ప్రభుత్వ ఏరియా వైద్యశాలకు తరలించి చికిత్స అందిస్తున్న భద్రాచలం ఐటీడీఏ గురుకులాల ఆరీసీవో తెలిపారు. మెరుగురైన వైద్య చికిత్స అందించేందుకు ఖమ్మం ప్రభుత్వ వైద్యశాలకు తల్లిదండ్రులను వెంట ఇచ్చి అంబులెన్సులో పంపించామని పేర్కొన్నారు. బాలిక పరిస్థితి నిలకడగానే ఉందని వివరించారు. కాగా బాలిక దసరా సెలవులకు వెళ్లి వచ్చిన అనంతరం నుంచి మానసికంగా ఆందోళనకరంగా ఉంటుందని తోటి విద్యార్థులు పేర్కొన్నట్లు సమాచారం.

# నామినేట్ పదవి ఇవ్వాలని వినతి



**ఇల్లందు, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేసిన తనకు నామినేట్ పదవి ఇవ్వాలని గురువారం హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్ లో టిపిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ కు జిల్లా మైనార్టీ సెల్ కార్యదర్శి యండి. ఇబ్రహీం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ గత కొన్ని ఏళ్ల నుండి కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కృషి చేయడం జరుగుతుందని, గత రెండు పర్యాయాలు అధికారంలో లేకపోయినప్పటికీ కాంగ్రెస్ పార్టీ జెండా వదలకుండా ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నానని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు ప్రతి కార్యక్రమంలో పాల్గొన్నానని, పార్టీ బహిరంగ సభలో తన వంతుగా కార్యకర్తలను తీసుకువెళ్లినట్లు తెలిపారు. తాను విద్యార్థులు నుండి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నానని స్పష్టం చేశారు. తాను కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని ఉన్నందున ప్రస్తుతం రాష్ట్రంలో అధికారంలో ఉన్న ప్రజా ప్రభుత్వంలో నామినేట్ పదవి ఇచ్చి తనకు గుర్తింపు ఇవ్వాలని కోరారు.

# భద్రాద్రి రామయ్యకు నిత్యకల్యాణం



**భద్రాచలం, అక్టోబరు 16, ప్రజాజ్యోతి:** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యాహావచనం, కంకణధారణ, జీలకర్రబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# మెడికల్ యూనివర్సిటీలో స్టేట్ రెండో ర్యాంక్ సాధన-భూక్య రమేష్.



**పాల్వంచ(రూరల్) అక్టోబర్ 16(ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఈరు తండా నివాసి భూక్య రమేష్ ఇటీవల మెడికల్ యూనివర్సిటీ లో ఈ సంవత్సరం స్టేట్ ఎగ్జామ్స్‌లో రెండో ర్యాంక్‌ను సాధించి తన ప్రతిభను నిరూపించారు.ఈ విజయంతో భూక్య రమేష్ కుటుంబం సభ్యులు,మిత్రులు,గ్రామస్తులు గర్వపడుతున్నారు.ఈ ప్రతిభ సాధనకు కృషి,పట్టుదల,సమయపాలన ముఖ్య కారణాలుగా చెబుతున్నారు.విద్యా ప్రయాణంలో ఇంత గొప్ప విజయాన్ని సాధించడం యువతకు ప్రేరణగా నిలుస్తుందని విద్యా నిపుణులు పేర్కొన్నరు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు రమేష్ ఈ విజయంతో గర్వకారణంగా నిలిచారు.ఇలాంటి ప్రతిభావంతుల జీవితాలు యువతకు గమ్యాన్ని చూపే తారలు అని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# అన్నపురెడ్డిపల్లి నూతన తహసీల్దారుగా గంట ప్రతాప్ బాధ్యతలు స్వీకరణ



**అన్నపురెడ్డిపల్లి,అక్టోబర్ 16, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల నూతన తహసీల్దారుగా గంట ప్రతాప్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన కరకగూడెం నుండి బదిలీపై ఇక్కడికి వచ్చి బాధ్యతలు చేపట్టారు. మండల సిబ్బంది, అధికారులు ఆయనను సాదరంగా ఆహ్వానించారు.

# మహిళలు స్వయం శక్తిగా ఎదగాలి – అదనపు కలెక్టర్ విద్యా చందన.

- **నారాయణరావుపేటలో టైలరింగ్ శిక్షణ కేంద్రం, తోగూడెం–రంగాపురం గ్రామాల్లో పోషణ వాటికల పరిశీలన.**




**పాల్వంచ(రూరల్) అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అదనపు కలెక్టర్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి (డీఆర్‌డీఓ) విద్యా చందన గురువారం నారాయణరావు పేట ఎస్సీ కాలనీలో ఏర్పాటు చేసిన మహిళల టైలరింగ్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించింది. అలాగే తోగూడెం,రంగాపురం గ్రామ పంచాయతీల్లో ఏర్పాటు చేసిన పోషణ వాటికల (ఆహార తోటల)ను కూడా పరిశీలించింది.అదనపు కలెక్టర్ విద్యా చందన మాట్లాడుతూ మహిళలు కష్టపడి పనిచేస్తేనే సమాజంలో ప్రత్యేక గుర్తింపు, గౌరవం లభిస్తుందని తెలిపింది. భారతీయ స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ (ఎస్‌బిఐ ఆర్‌ఎస్‌ఈటిఐ) ఆధ్వర్యంలో "ఉన్నతి కార్యక్రమం" కింద ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పూర్తి చేసిన కుటుంబ సభ్యుల కోసం ఈ కుట్టు శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయబడిందని వివరించింది.ఈ కేంద్రంలో 30 రోజులపాటు మహిళలకు కుట్టు శిక్షణ అందజేస్తున్నట్లు తెలిపింది.శిక్షణలో భాగంగా మహిళలు కుట్టుతున్న బ్లౌజులు,గౌన్లను ఎస్‌బిఐ ఆర్‌ఎస్‌ఈటిఐ డైరెక్టర్ చంద్రశేఖర్‌తో కలిసి పరిశీలించింది.డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు తక్కువ వడ్డీతో రుణాలు అందిస్తున్నట్లు విద్యా చందన వివరించింది. ఎస్‌బిఐ ఆర్‌ఎస్‌ఈటిఐ డైరెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ శిక్షణ పూర్తిచేసిన మహిళలకు ముద్ర రుణాలు అందజేయడానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళలు నేర్చుకుంటున్న విధానం ప్రశంసనీయమని,ఈ స్ఫూర్తితో స్వయం ఉపాధి దిశగా ముందుకు సాగాలని సూచించారు.తర్వాత తోగూడెం తండా,రంగాపురం అంగన్వాడీ కేంద్రాలలో ఏర్పాటుచేసిన పోషణ వాటికల పనులను అదనపు కలెక్టర్ పరిశీలించింది.మహిళలతో మమేకమై పోషకాహార ప్రాముఖ్యతపై అవగాహన కల్పించింది.శిక్షణ పొందుతున్న మహిళలకు బట్టలు,శిక్షణ సామగ్రిని అదనపు కలెక్టర్ విద్యా చందన,ఎస్‌బిఐ డైరెక్టర్ చంద్రశేఖర్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర రెడ్డి,ఎంపీఓ చెన్నకేశవులు,బ్యాంకు అధికారులు, ఏపీవో పోరండ్ల రంగా,ఎల్.డి.ఎంలు వి.రామిరెడ్డి,ఏ.రవి ప్రసాద్,సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న,కోర్సు డైరెక్టర్ రాజారత్నం, ఎస్‌బీఎం కన్సల్టెంట్ రేవతి, సూపర్వైజర్ అశోక్,కార్యదర్శులు రవి, నవీన్‌తదితరులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలన దిశగా దమ్మపేట పోలీసుల పిలుపు

- **ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా ముందుకు రావాలని ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి విజ్ఞప్తి**
- **జిల్లా ఎస్పీ రోహిత్ రాజు (ఐపీఎస్) ఆదేశాల మేరకు చైతన్యం పేరుతో నెల రోజుల అవగాహనా కార్యక్రమాలు ప్రారంభం**







**దమ్మపేట, అక్టోబర్ 16 (ప్రజా జ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు (ఐపీఎస్) ఆదేశాల మేరకు మాదక ద్రవ్యాల నిర్మూలనకు, దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నెల రోజుల పాటు "చైతన్యం – డ్రగ్స్ వద్దు అని చెప్పండి, జీవితానికి అవును అని చెప్పండి" పేరుతో పలు కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమాలను దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్నారు. దీనిలో భాగంగా దమ్మపేట మండలంలోని మందలపల్లి క్రాస్ రోడ్డు వద్ద మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే అనర్థాలపై అవగాహనా కార్యక్రమం గురువారం రోజు నిర్వహించబడింది. కార్యక్రమంలో విద్యార్థులు, యువత, స్థానిక ప్రజలు పాల్గొని మత్తు పదార్థాల దుష్ప్రభావాలపై అవగాహన పొందారు. ఈ సందర్భంగా ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ – "దమ్మపేట మండలాన్ని మాదక ద్రవ్య రహితంగా మార్చడం ప్రతి ఒక్కరి భాద్యత. యువత మత్తుకు బానిసలుగా మారి తమ జీవితాలను నాశనం చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి. ఈ అవగాహనా కార్యక్రమాల ద్వారా సమాజంలో చైతన్యం కలిగించడమే మా లక్ష్యం" అని పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీస్ విభాగం నెల రోజుల పాటు దమ్మపేట మండలం వ్యాప్తంగా వివిధ గ్రామాల్లో మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన అవగాహనా సదస్సులు, ర్యాలీలు, పోస్టర్ ప్రచారాలు, కౌన్సిలింగ్ కార్యక్రమాలు నిర్వహించనుంది. దమ్మపేట మండలంలోని గంజాయి హాట్స్పాట్స్ లో ప్రతిరోజూ తనిఖీలు నిర్వహించడం, అనుమానాస్పద వాహనాలపై దృష్టి పెట్టడం, మత్తు పదార్థాల వ్యసనానికి గురైన యువతకు కౌన్సిలింగ్ చేయడం వంటి చర్యలు చేపడుతున్నామని ఎస్ ఐ తెలిపారు.అలాగే ఎవరైనా నిషేధిత మత్తు పదార్థాలు రవాణా చేస్తున్నట్లు, విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు సమాచారం తెలిస్తే దమ్మపేట పోలీసులను వెంటనే సమాచారం అందించాలని ప్రజలను కోరారు. ప్రజల సహకారం లేకుండా మాదక ద్రవ్య రహిత సమాజం సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారు. ప్రతి గ్రామంలో ప్రతి పౌరుడు తన వంతు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి, హెడ్ కానిస్టేబుల్ బాలస్వామి, పోలీస్ సిబ్బంది మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# మత్తు భవిషత్తు కు ముప్పు

- **విద్యార్థులు డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములుగా మారాలి....ఎస్ఐ మధుప్రసాద్**




**ములకలపల్లి, అక్టోబర్ 16, ప్రజాజ్యోతి:** మత్తు పదార్థాల వినియోగం వల్ల సమాజం తీవ్రంగా దెబ్బతింటుందని, యువత డ్రగ్స్ బారిన పడకుండా చైతన్యవంతంగా ముందుకు రావాలని ములకలపల్లి ఎస్ ఐ కె. మధుప్రసాద్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో "డ్రగ్స్ పై యుద్ధం" అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులకు మాధకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ప్రమాదాలను వివరించారు. "డ్రగ్స్ వినియోగం కేవలం వ్యక్తిగత స్థాయికే పరిమితం కాకుండా, కుటుంబాలను, సమాజాన్ని, దేశ భవిష్యత్తును నాశనం చేస్తోంది. సమిష్టిగా మనమందరం కలసి ఈ మహమ్మారిపై పోరాటం చేయాలి. ప్రతి విద్యార్థి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి భాగస్వామిగా మారాలి," అని అన్నారు. అనంతరం విద్యార్థులచే డ్రగ్స్ వినియోగానికి వ్యతిరేకంగా డ్రగ్స్ రహిత సమాజం కోసం తమవంతు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఇన్ చార్జి ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ షేక్ అతహర్ అలీ, అధ్యాపకులు చంద్రమౌళి, కుమారస్వామి, సుధాకర్, జీవివి వాణి, సుప్రియ, రామకృష్ణ, స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.